సాక్షి
జగిత్యాల

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



రావయ్యా.. గణపయ్యా



ఆది దంపతుల ప్రియసుతుడు, సర్వ విఘ్నాలు తొలగించే గణనాథుడు భూలోకంలో భక్తుల కోరికలు తీర్చేందుకు విచ్చేస్తున్నాడు. ఆయనకు స్వాగతం పలికేలా మంటపాలను మామిడితోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈసారి మట్టిగణపతినే పూజించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడేలా తనను మట్టిరూపంలో కొలిచేందుకు సిద్ధమైన భక్తుల కోరికలు తీర్చాలన్న ఆకాంక్షతో వినాయకుడు మరికొద్ది గంటల్లోనే భువిపైకి చేరనున్నాడు. ఈ సాయంత్రం నుంచి నవరాత్రులపాటు ఘనమైన పూజలందుకోనున్నాడు. తీరొక్క ఫలహారం.. ఉండ్రాళ్ల నైవేద్యం.. భజనలు తదితర ప్రత్యేక కార్యక్రమాలతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మికశోభ సంతరించుకోనుంది. వినాయక చవితి విశిష్టత.. పూజావిశేషాలతో ప్రత్యేక కథనం..

- వివరాలు 8లో

న్యూస్‌రీల్

జాతీయ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న దావ వసంత

జగిత్యాలజోన్: జెడ్పీ కార్యాలయంలో ఆదివారం జాతీయ సమైక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత కార్యాలయ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, ఇన్‌చార్జి జెడ్పీసీఈవో నరేశ్, పీఆర్ ఈఈ రహమాన్, డీఈ మిలింద్ తదితరులు పాల్గొన్నారు.

జాతి సమైక్యతతో ముందుకు సాగాలి



జెండా వందనం చేస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: జాతి సమైక్యతతో ముందుకు సాగాలని ఎస్పీ భాస్కర్ కోరారు. ఆదివారం తెలంగాణ సమైక్యత దినోత్సవం సందర్భంగా ఎస్పీ క్యాంప్ కార్యాలయం, జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ, అనేక మంది యోధుల త్యాగఫలంతో స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. డీఎస్పీలు వెంకటస్వామి, రవీందర్‌రెడ్డి, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, రిజర్వ్ సీఐలు రామకృష్ణ, జానీమియా, వేణు, రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న కృష్ణ

జగిత్యాల: స్థానిక విరూపాక్షి గార్డెన్స్‌లో ఆదివారం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. 180 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. అసోసియేషన్ చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ, గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. డీవైఎస్‌వో రవికుమార్ ఉన్నారు.

సమైక్యతతోనే అభివృద్ధి

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం
- పంచాయతీ సర్పంచులకు సన్మానం



మహనీయులకు నివాళి అర్పిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, అధికారులు



జాతీయ పతాకం ఆవిష్కరిస్తున్న మంత్రి

జగిత్యాల: సమైక్యతతోనే అన్నివిధాలా అభివృద్ధి సాధ్యమని సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఇందులో భాగంగానే జాతీయ సమైక్యతను చాటేలా జిల్లాలో పతాకావిష్కరణ చేశామన్నారు. ఆదివారం జాతీయ సమైక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో మంత్రి జాతీయ పతాకావిష్కరణ చేశారు. రాష్ట్రంతోపాటు దేశాభివృద్ధిని ఆకాంక్షిస్తూ వేడుకలు నిర్వహించామని తెలిపారు. ప్రజలు అన్ని సౌకర్యాలు అనుభవిస్తూ, సగౌరవంగా జీవించడమే లక్ష్యమని అన్నారు. తొలుత మంత్రి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వం అండ

పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జగిత్యాలలో 4,520 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించామని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నూకపల్లిలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు మంచినీటి వసతి కోసం రూ.14 కోట్లతో చేపట్టిన మంచినీటి పథకానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. పేదవారి కల నెరవేరుతుందని, ప్రతీఒక్కరికి డబుల్‌బెడ్‌రూం ఇల్లు కేటాయిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత సహకారంతో జగిత్యాలలోనే 4,520 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించామన్నారు.

మట్టి వినాయకులనే పూజించాలి

మట్టి వినాయకులనే పూజించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ బోర్డు అందించిన మట్టి వినాయక విగ్రహాలను మంత్రి పంపిణీ చేసి మాట్లాడారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన విగ్రహాలతో చెరువులన్నీ కలుషితమవుతాయన్నారు. మట్టి వినాయక విగ్రహాలు పూజించడమే మేలని ఆయన తెలిపారు. అలాగే విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వకర్మ విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్న పంచాయతీ సర్పంచులను మంత్రి సన్మానించారు.



మెట్‌పల్లిరూరల్: చింతలపేట సర్పంచ్ అర్చనను అభినందిస్తున్న మంత్రి



ధర్మపురి : చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

ధర్మపురి: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ట్రాన్స్‌జెండర్ల సాధికారిత శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన దివ్యాంగులకు ఉపకరణాలు, చెక్కులు పంపిణీ చేశారు. రూ.83.16 లక్షల విలువైన 30 స్కూటీలు, 110 బ్యాటరీ సైకిళ్లు, 2 బ్యాటరీ వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు అందజేశాక మంత్రి మాట్లాడారు. గత పాలకులు దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. ప్రజలు మళ్లీ సీఎం కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. అంతకుముందు రాయికల్‌కు చెందిన దివ్యాంగురాలు చేసిన భరతనాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ధర్మపురి, బుగ్గారం ఎంపీపీ, జెడ్పీటీసీలు చిట్టిబాబు, బాదినేని రాజమణి, బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, జిల్లా సంక్షేమాధికారి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు సాధించడం అభినందనీయం

మెట్‌పల్లిరూరల్: చింతలపేట గ్రామపంచాయతీ రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డు సాధించడంపై మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ యాస్మిన్‌బాషా అభినందించారు. సర్పంచ్ మ్యాకల అర్చనను శాలువాతో సన్మానించారు. చింతలపేటను మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడం అభినందనీయమని ప్రశంసించారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

వెల్గటూర్(ధర్మపురి): అభివృద్ధిని చూసి ఆదరించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో మంత్రి పాల్గొన్నారు. శాఖాపూర్, వెంకటాపూర్, బూరుగుపల్లికి చెందిన 80మంది బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, జెడ్పీటీసీ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటుహక్కు ప్రాముఖ్యతపై ప్రచారం

జగిత్యాల: జిల్లాలో 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతీఒక్కరు ఓటరుగా జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. కలెక్టరేట్‌లో ఆదివారం జాతీయ సమైక్యత దినోత్సవం నిర్వహించారు. జగిత్యాల, గొల్లపల్లి, ధర్మపురిలోని చిన్నారులు, యువతులు, మహిళలతో కలిసి మెహందీ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన వారు ఈనెల 19వ తేదీ వరకు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

వాగులో బయల్పడిన హనుమాన్ విగ్రహం



పూజలు చేస్తున్న కాలనీవాసులు

జగిత్యాలరూరల్: బల్దియాలోని ఎనిమిదో వార్డు పరిధిలో ప్రవహించే ధరూర్ వాగులో ఆదివారం శ్రీఆంజనేయస్వామి విగ్రహం బయల్పడింది. దీంతో కాలనీవాసులు అక్కడకు వెళ్లి పూజలుచేశారు. రైతు తన పొలం వద్దకు వెళ్తుండగా ఇసుకలో స్వామివారి తలభాగం కనిపించింది. ఇసుక తొలగించడంతో విగ్రహం పూర్తిగా బయటపడింది.

నియామకం

కోరుట్లరూరల్: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ లైబ్రరీ కమిటీ చైర్మన్‌గా వెంకటాపూర్ గ్రామానికి చెందిన న్యాయవాది కటుకం రాజేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు.

ఆకలి తీరేలా.. డ్రాపౌట్లు తగ్గేలా..

- సర్కారు బడుల్లో 'సీఎం అల్పాహారం'
- జిల్లాలో 94వేల మంది పేదల విద్యార్థులకు ప్రయోజనం



కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

కథలాపూర్(వేములవాడ): రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలోని సుమారు 94వేల మంది పేద విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందనుంది. తద్వారా వారి తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోంది. దసరా కానుకగా 'సీఎం అల్పాహారం పథకం' ప్రారంభించనున్నట్లు సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్‌లు గణనీయంగా తగ్గుతుందని వారు భావిస్తున్నారు.

754 పాఠశాలలు..
94,984 మంది విద్యార్థులు..

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 380 గ్రామాలుండగా.. వీటి పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ హైస్కూళ్లు 741 ఉన్నాయి.
- ఇవికాకుండా 13 మోడల్ స్కూళ్లు ఉన్నాయి.
- వీటిలో ఒకటి నుంచి పదోతరగతి వరకు 94,984 మంది విద్యార్థులు చదువుతున్నారు.
- ఇందులోని విద్యార్థులకు ఇప్పటికే మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.
- ఈ ఏడాది నుంచి విద్యార్థులకు రాగి జావ కూడా అందజేస్తున్నారు.
- దసరా పండుగ(ఈనెల 24) నుంచి ఉదయం అల్పాహారం కూడా అందనుంది.
- గ్రామాల్లో ఉన్నత పాఠశాలలు అందుబాటులో లేక దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు ఉదయం పస్తులుండి హాజరవుతున్నారు.
- మరికొందరు టిఫిన్ కోసం ఇళ్లలోనే నిరీక్షించి ఆలస్యంగా హాజరవుతున్నారు.
- ఇంకొందరు ఖాళీ కడుపులతో పాఠశాలకు వచ్చి తరగతి గదిలో నీరసించిపోతున్నారు.
- ఉదయం అల్పాహారం సౌకర్యం కల్పించడంతో ఇట్లాంటి పేద పిల్లలకు కడుపునిండుతుందని తల్లిదండ్రులు భావిస్తున్నారు.
- అంతేకాదు.. విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు చేరుకోవడానికి ఆసక్తి చూపుతారని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.
- సీఎం అల్పాహారం పథకం ప్రవేశపెట్టడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సకాలంలో నాణ్యమైన టిఫిన్, మధ్యాహ్న భోజనం అందితే.. వారు చదువుపై మరింత శ్రద్ధ పెడతారని, ఆరోగ్యపరమైన సమస్యలు దరి చేరవని విద్యాభిమానులు పేర్కొంటున్నారు.

కలిగోట నుంచి వస్తున్న



ప్రతీరోజు కలిగోట నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని కథలాపూర్ మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సులో వస్తున్న. పొద్దున ఇంట్లో టిఫిన్ తయారు చేస్తున్నా.. బస్సుకు ఆలస్యమవుతుందని తింటలేను. మధ్యాహ్నం బడిలోనే అన్నం తింటున్న. స్కూల్‌లోనే పొద్దున టిఫిన్ పెడితే ఇబ్బందులు ఉండవు.

– పులి రిషిందర్, ఎనిమిదో తరగతి, కలిగోట

డ్రాపౌట్స్ తగ్గుతాయి



ఐదేళ్ల క్రితం రిజిష్టర్‌లో విద్యార్థుల పేర్లు ఎక్కువగా ఉండేవి. కానీ, తక్కువ సంఖ్యలో హాజరయ్యేవారు. పేద విద్యార్థులు భోజనం, ఇతర అవసరాల కోసం కూలీ పనులకు వెళ్తున్నట్లు గుర్తించాం. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు ఇస్తున్నామని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. దీంతో హాజరు శాతం పెరిగింది. ఇప్పుడు టిఫిన్ సౌకర్యం కల్పిస్తుండడంతో డ్రాపౌట్స్ బాగా తగ్గుతాయి.

– సురేశ్, హెచ్‌ఎం, పీఎస్, సిరికొండ

పకడ్బందీగా అమలు



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టిఫిన్ సౌకర్యం కల్పించడం ద్వారా పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. ఉదయం పాఠశాలల్లోనే టిఫిన్ అందించడంతో విద్యార్థులకు అలసట, నీరసం ఉండకుండా పాఠాలు బాగా వింటారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈ పథకాన్ని అన్ని స్కూళ్లలో పకడ్బందీగా అమలు చేస్తాం.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

క్లుప్తంగా

రాజేశ్వర్‌రావుపేట పాలకవర్గంపై ఫిర్యాదు


చెర్లకొండాపూర్‌లో పూడ్చివేసిన గుంతలు

మెట్‌పల్లిరూరల్: గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణం కోసం తవ్విన గుంతలను పూడ్చివేశారంటూ రాజేశ్వర్‌రావుపేట పంచాయతీ పాలకవర్గంపై చెర్లకొండాపూర్ జీపీ కార్యదర్శి హరీశ్ ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 1197లో గల భూమిలో శనివారం చెర్లకొండాపూర్ పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. ఇందుకోసం తవ్విన గుంతలను ఆదివారం జేసీబీ సాయంతో పూడ్చివేయించారని తెలిపారు. రాజేశ్వర్‌రావుపేట పాలకవర్గ సభ్యులతోపాటు మరికొందరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పురాతన గడి బురుజుకు పెయింటింగ్


పెయింటింగ్ వేసిన బురుజు వద్ద క్లీన్ రైడర్స్

కోరుట్ల: కోరుట్ల క్లీన్ రైడర్స్ ఇండియన్ స్వచ్ఛత లీగ్‌లో భాగంగా ఆదివారం కళాశాల విద్యార్థులు, మున్సిపల్ ఉద్యోగులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల క్లీన్ రైడర్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని అతి పురాతన గడి బురుజుకు పెయింటింగ్ చేశారు. లోగోను ఆవిష్కరించారు.

బండి పేపర్స్ పోయినవి

టీకొండ మల్లవ్వ, W/o. మల్లేశం Vill: ఆత్మకూర్, మం॥ గొల్లపెల్లి జి॥ జగిత్యాల గారి యొక్క Bike HF Deluxe 2019- TS 21E 8342 గల వెహికిల్ RC మరియు Insurance Papers పడిపోయినవి. దొరికినవారు తిరిగి ఇవ్వగలరు. సెల్: 9441879839

మహాకాయ.. పార్వతి తనయ

నేటి నుంచి వినాయక నవరాత్రోత్సవాలు



కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్ : మహాకాయుడు.. పార్వతి తనయుడు.. సర్వ విఘ్న వినాశకుడు వినాయకుడి చవితి వేడుకలకు ప్రజలు సమాయత్తమయ్యారు. వేదకాలం నాటికే గణపతి పూజనీయుడైన దేవుడు. గజాననుడు, గణపతి, ఏకదంతుడు, లంబోధరుడు.. ఇలా ఎన్నో పేర్లతో భక్తులతో పూజలందుకుంటాడు. ఆబాల గోపాలానికి ఆరాధ్య దైవ్యం. ఏ కార్యం ప్రారంభించినా.. ఏ పూజ నిర్వహించినా మొదట పూజించేది వినాయకుడినే. భాద్రపద శుద్ధ చవితి స్వామి వారి పుట్టినరోజు కావడంతో వినాయకచవితి పర్వదినం లోక ప్రసిద్ధి చెందింది. చిన్న కండ్లు సూక్ష్మ బుద్ధికి, తొండం స్వీయ గౌరవానికి, పెద్ద చెవులు సకల విశేషాలను ఆకళింపు చేసుకోవడానికి, పెద్ద బొజ్జ రహస్యాలను దాచి ఉంచుకోవడానికి ప్రతీకలు. సోమవారం వినాయకచవితి సందర్భంగా కథనం..

గణపతులు 32 రూపాలు

- తంత్రశాస్త్రంలో గణపతులు 32 రూపాలుగా వర్ణించబడ్డాయి. భక్తి గణపతి, లక్ష్మీగణపతి, సిద్ధి గణపతి, భువనేశ గణపతి, హేరంబ గణపతి, మహాగణపతి, విఘ్నరాజ గణపతి, ఊర్ధ్వ గణపతి, ఉచ్ఛిష్ట గణపతి, శక్తి గణపతి, ధ్వజ గణపతి అనే 16 రూపాలు ఎక్కువ ప్రచారంలో ఉండగా, శ్రీవిజయ గణపతి, ఏకాక్షర గణపతి, వర గణపతి, త్ర్యక్షర గణపతి, హరిద్ర గణపతి, ఏకదంత గణపతి, సృష్టి గణపతి, ఉద్దండ గణపతి, రుద్ని గణపతి, దుండిగణపతి, ద్విముఖ గణపతి, త్రిముఖ గణపతి, సింహ గణపతి, యోగ గణపతి, శ్రీసంకటహర గణపతి అన్నవి అంతగా ప్రచారంలో లేవు.

వ్రత విధానం

- చవితినాడు ఉదయం స్నానానంతరం నిత్యకర్మలు పూర్తి చేసుకుని శక్తిని బట్టి బంగారం, వెండి, మట్టితో చేసిన వినాయకుడి ప్రతిమను ఇంట్లో ఉత్తరం దిశలో బియ్యం పోసి మండపాన్ని నిర్మించాలి. అష్టదళ పద్మాన్ని రూపొందించి వినాయకున్ని ప్రతిష్ఠించాలి. శ్వేత గంధ అక్షతలు, పుష్పాలు ఏకవింశతి పత్రాలతో అర్చించాలి. ధూప, దీపాలు, వెలగ, నేరేడు తదితర ఫలాలను రకానికి 21 చొప్పున నివేదించాలి. త్రిలోక ప్రసిద్ధమైన ఈ వ్రతాచరణతో గణపతి అనుగ్రహం కలిగి సర్వ కార్యాలూ నెరవేరుతాయి. ఈ వ్రతాచరణ ఫలితంగానే విదర్భ రాజ యువరాణి దమయంతి నల మహారాజును, శ్రీకృష్ణుడు శమంతక మణి, జాంబవతి, సత్యభామకు ఇష్ట సఖుడయ్యాడు.



విదేశాల్లో సైతం గణపతి ఆరాధన

గణపతి ఆరాధన కేవలం మన దేశానికే పరిమితం కాదు. శ్రీలంక, టిబెట్, నేపాల్, థాయ్‌లాండ్, పర్షియా, ఆఫ్ఘనిస్తాన్, మధ్యఆసియా, జావా, బలిద్వీపం, బోర్నియా, మంగోలియా, కంబోడియా, బర్మా, చైనా, జపాన్, అమెరికా వంటి దేశాల్లో కూడా వినాయకుడిని వారి వారి సంప్రదాయాల్లో రూపొందించి ఆరాధిస్తారు.

భార్య వేధింపులతో భర్త ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రహ్మత్‌పురలో నివాసం ఉండే షేక్ ముజాహిద్ (45) తన భార్య వేధింపులతో ఆత్మహత్యకు చేసుకున్నాడు. జగిత్యాల పట్టణ ఎస్‌ఐ మన్మదరావు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లికి చెందిన షేక్ ముజాహిద్ తన భార్యతో విడాకులు తీసుకున్నాడు. వివాహమై ఓ కూతురు ఉన్న రఫియాను రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి మరో ఇద్దరు పిల్లలు జన్మించారు. ఈ క్రమంలో కొంతకాలంగా రఫియా తన కూతురితో కలిసి అతన్ని వేధిస్తోంది. శనివారం ఈ విషయాన్ని ముజాహిద్ తన సోదరుడికి ఫోన్‌లో తెలిపాడు. అంతలోనే ఉరేసుకున్నాడు. మృతుడి సోదరుడు అహ్మద్ ఫిర్యాదు మేరకు రఫియా, ఆమె కూతురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించండి

వెల్గటూర్: నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని వెల్గటూర్ గ్రామస్తులు కోరారు. ఆదివారం వెల్గటూర్ మండల కేంద్రంలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం అందించారు. కరోనాకు ముందు మండల కేంద్రానికి జగిత్యాల నుంచి గొల్లపల్లి, రాపల్లి మీదుగా నైట్ హాల్ట్ బస్సు నడిచేదన్నారు. కరోనా తర్వాత నిలిపివేశారని పేర్కొన్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం జగిత్యాలకు వెళ్లేవారు, ఆస్పత్రులకు వెళ్లేవారు, ఉద్యోగులు, విద్యార్థులు మొత్తం 12 గ్రామాలకు చెందినవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సాయంత్రం 4 గంటల తర్వాత ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తే ఇష్టారీతిన చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిపూట సొంత వాహనాలపై వచ్చేవారు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని మంత్రికి విన్నవించగా సానుకూలంగా స్పందించారన్నారు. సింగం పవన్, బందెల నర్సయ్య, గుండ జగదీశ్వర్, బందెల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నిజాంను తలపించేలా నిరంకుశ పాలన

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు
- పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం

జగిత్యాలటౌన్:కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిజాంను తలపించేలా నిరంకుశ పాలన సాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు విమర్శించారు. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సర్దార్ పటేల్ సాహసోపేతమైన సైనిక చర్యతో తెలంగాణకు స్వేచ్ఛావాయువులు లభించాయన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కోరుట్లలో బీజేపీ, ఏబీవీపీ ఆధ్వర్యంలో..

కోరుట్ల: బీజేపీ, ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవేంకటేశ్వర ఆలయం, పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట జాతీయ జెండా ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. యూసుఫ్‌నగర్‌లో సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్ జాతీయ జెండా ఎగురవేశాడు. జోగిన్‌పెల్లిలో నైజాం విముక్త స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు నారాయణరెడ్డి కుమారుడు బలవంతరెడ్డితోపాటు సమరయోధుల కుమారులను సన్మానించారు. నాయకులు దుంపాల నర్సు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కథలాపూర్(వేములవాడ): సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు ఆదివారం కథలాపూర్‌లో వినతిపత్రం అందించారు. ఏళ్లుగా తాము వెట్టిచాకిరీ చేస్తున్నామని, తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలన్నారు. జిల్లా కేంద్రంలో నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కనికరించడం లేదని వాపోయారు. స్పందించిన ఆయన సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి రవి, మండల ప్రతినిధులు చంద్రశేఖర్, గంగరాజం, లక్ష్మణ్, హన్మాండ్లు, ప్రసాద్, విజయ్ ఉన్నారు.

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి పరామర్శ

కథలాపూర్ మండలంలోని ఇప్పపెల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈవో లింగారెడ్డి వారం రోజుల క్రితం మృతిచెందగా.. బాధిత కుటుంబాన్ని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలు తెలుసుకొని, వారిని ఓదార్చారు. లింగారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోకబాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ సభ్యుడు భూమయ్య, సర్పంచ్‌లు వసంత, గంగప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు బాలు, కిరణ్‌రావు, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.


వినోద్‌కుమార్‌కు విన్నవిస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

అంజన్న సేవలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే సతీమణులు

కొండగట్టు: స్థానిక శ్రీఆంజనేయ స్వామివారిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి మాధవి, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సతీమణి దీవెన ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు వారి గోత్రనామాలపై పూజలు నిర్వహించి, వేదోక్త ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం కొడిమ్యాల మండలంలోని నాచుపెల్లి బృందావన్ రిసార్ట్‌లో బీఆర్‌ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలతో మాధవి సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కొడిమ్యాల, మల్యాల ఎంపీపీలు మేనేని స్వర్ణలత, మిట్టపెల్లి విమల, సర్పంచ్‌లున్నారు.


అంజన్న ఆలయంలో మాధవి, దీవెన

ఉద్యోగిని దూషించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు


ఠాణాలో ఫిర్యాదు చేసిన నాయకులు

మల్యాల: స్థానిక విద్యుత్ ఉద్యోగిని కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మల్యాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌గా పని చేస్తున్న బొడిగె శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ దారం మొగిలయ్య శనివారం మల్యాల మండల కేంద్రానికి చెందిన కస్తూరి మహేశ్ ప్రసాద్ ఇంటికి వెళ్లారు. బకాయిలు చెల్లించడం లేదని, విద్యుత్ కనెక్షన్ తొలగించారు. దీంతో అతను అదేరోజు సాయంత్రం సబ్‌స్టేషన్‌కు వెళ్లి, బిల్లు కట్టినా కనెక్షన్ ఇవ్వరా అంటూ లైన్‌మెన్‌ను కులం పేరుతో దూషించాడు. చెప్పుతో కొట్టి, చంపుతానని బెదిరించాడు. బాధితుడు శ్రీనివాస్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రాంజీ నాయక్, 327 యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.శంకర్, కె.రాజమల్లు, ఎ.ప్రమోద్, రాజలింగం, ఏఈ కొమ్ము కమలేశ్వర్, నరేశ్, ఎల్.ప్రకాశ్‌లతో కలిసి ఆదివారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించడంతోపాటు కులం పేరుతో దూషించి, దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని రాంజీ నాయక్ అన్నారు. సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మహేశ్ ప్రసాద్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'జీపీ కార్మికులను మోసగిస్తున్న ప్రభుత్వం'


మాట్లాడుతున్న వెంకటయ్య, పక్కన నాయకులు

జగిత్యాలరూరల్: గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వం మోసం చేస్తోందని జీపీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య అన్నారు. ఆదివారం జగిత్యాల మినీస్టేడియంలో సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు 34 రోజులు సమ్మె చేశారని తెలిపారు. ఆ సమయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమస్యలు పరిష్కరిస్తామని రెండుసార్లు చర్చలకు పిలిచారని పేర్కొన్నారు. 17 డిమాండ్లలో కేవలం మూడింటినే పరిష్కరిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని శాఖల ఉద్యోగ వేతనాలు 30 శాతం పెంచి, పంచాయతీ కార్మికులకు పెంచకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ సులోచన, ప్రధాన కార్యదర్శి పులి మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

సహస్ర చంద్రోత్సవం


సన్మానిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి: ధర్మపురికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రొట్టె శ్రీనివాస్ తల్లిదండ్రులు బాలకృష్ణ–భాగ్యలక్ష్మిలకు సహస్ర చంద్రోత్సవం(షష్టిపూర్తి) ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులతోపాటు డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి హాజరై, వారిని సన్మానించారు.

జ్యోతిష్యాచార్య అవార్డు ప్రదానం


శ్రీధర్ సిద్ధాంతికి అవార్డు అందిస్తున్న చైర్మన్ వేణుగోపాల్

కోరుట్ల: పట్టణానికి చెందిన పురోహితుడు, జ్యోతిష్య శాస్త్ర నిపుణుడు ఉద్దంటి శ్రీధర్ సిద్ధాంతికి అల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్యోతిష్యాచార్య అవార్డు ప్రదానం చేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ చైర్మన్ సముద్ర వేణుగోపాల్, దైవజ్ఞ శర్మ చేతులమీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


హోమం నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని స్వర్ణకార సంఘ భవనంలో ఆదివారం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాంపల్లి సింహాద్రి, ప్రతినిధులు ఇల్లెందుల శ్రీధర్, సుంకం మహేశ్, తాడూరి శ్రీనివాస్, తునికి ఆనంద్, నాంపల్లి మారుతి, మల్యాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.